క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



బీమా డబ్బులు అందిస్తున్న సర్పంచ్

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన పడాల అప్పలనాయుడు కుటుంబానికి వైఎస్సార్ బీమా మంజూరైంది. తక్షణ సాయంగా రూ.10 వేలను సర్పంచ్ రాయి వనజ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎస్.జనార్దన రావు శనివారం మృతుని భార్య ధనలక్ష్మికి అందజేశారు. మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలి

● డీఎస్పీ కృష్ణారావు



పెండింగ్ కేసుల పురోగతిపై ఆరా తీస్తున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ రూరల్: వివిధ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రజల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని డీఎస్పీ జీఈ కృష్ణారావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను శనివారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల తాజా పురోగతిపై ఆరాతీశారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, బహిరంగ మద్యపాన నిషేధంపై దృష్టి సారించాలని సూచించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆయన వెంట సీఐ మురళీధర్, ఎస్ఐ బి.శివప్రసాద్ తదితరులున్నారు.

రెబ్బలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కొమరాడ: మండలంలోని చోళ్లపదం పంచాయతీ పరిధి రెబ్బ గ్రామంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు ఎంఎల్‌హెచ్‌పీ తేజశ్వనిమణి ఆధ్వర్యంలో కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీ సిబ్బంది గ్రామంలో పర్యటించి జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్తపరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను ఉచితంగా అందించారు. జ్వరం, రక్తహీనతతో బాధపడుతున్న ఓ వ్యక్తిని పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కె.బధిరినారాయణ, ఏఎస్ఎం రజని, హెల్త్ సహాయకుడు సురేష్ ఉన్నారు. అయితే వైద్యులు లేకుండా పీహెచ్‌సీ సిబ్బంది వచ్చి మందులు ఇచ్చి వెళ్లిపోయారని గ్రామస్తులు అంటున్నారు.

సారాతో వాహనం స్వాధీనం

పాలకొండ రూరల్: స్థానిక ఎన్‌కే రాజపురం కూడలి మీదుగా 20 సారాను ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న ఎం.నరేష్‌ను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపించారు. పట్టణ పరిధిలో చేపట్టిన విజుబుల్ పోలీసింగ్‌లో భాగంగా సారాను గుర్తించినట్టు ఎస్ఐ బి.శివప్రసాద్ తెలిపారు. తనిఖీల్లో వాహనాలకు ధ్రువపత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించినట్టు ఎస్ఐ చెప్పారు.

దోమల నివారణకు చర్యలు



దారపాడులో స్ప్రేయింగ్ చేస్తున్న సిబ్బంది

సీతంపేట: మండలంలోని దారపాడు, చెక్కాపురం గ్రామాల్లో శనివారం దోమల నివారణ మందు పిచికారీ చేశారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబల కుండా ఐఆర్ఎస్ 5 శాతం ఏసీఎం స్ప్రేయింగ్ చేయించినట్లు మలేరియా నివారణ సబ్‌యూనిట్ అధికారి మోహనరావు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిలో ఈ ద్రావణాన్ని పిచికారీ చేయించుకోవాలని సూచించారు. స్థానిక గిరిజన బాలుర సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. వైద్యాధికారి భానుప్రతాప్ ఉన్నారు.

అన్నసమారాధన

సీతంపేట: స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. నిమ్మక కాంతారావు, సాంబమూర్తి, మాధవరావు, ఉమామహేశ్వరరావు, దుర్గమ్మ, రాములు అన్నసమారాధన చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, రెడ్డప్ప, గోవిందరెడ్డి, ఆలయ అర్చకులు చిన్నగౌతమ్, పెద్దగౌతమ్, జగదీశ్వర్, హర్షకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో పాడిసంపద పదిలం

- వర్షాకాలంలో పొంచిఉన్న వ్యాధుల ముప్పు
- ముందస్తు జాగ్రత్తలతో మూగజీవాలకు రక్షణ
- పశువులకు ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు, టీకాలు



పాలకొండ రూరల్:

వర్షాకాలంలో మనుషులతో పాటు మూగజీవాలకు వ్యాధుల ముప్పు అధికంగా ఉంటుంది. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మనం ఏవిధంగా జాగ్రత్తలు తీసుకుంటామో.. అదేవిధంగా పశువుల ఆరోగ్య సంరక్షణకు పాడిరైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యులు సూచిస్తున్నారు. ఈ సీజన్‌లో పశువులకు గొంతువాపు, జబ్బవాపు వ్యాధి, లంపిస్కిన్, చిటుక వ్యాధి, నీలినాలుక వ్యాధి తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ముందు జాగ్రత్తలు తీసుకోవడం, టీకాలు వేయించడం ద్వారా వ్యాధుల నుంచి పాడిసంపదను కాపాడుకోవచ్చని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ ప్రభామాణిక్యరావు సూచిస్తున్నారు. ఏజెన్సీ కలబోసి ఉన్న పార్వతీపురం జిల్లాలో ఆవులు గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు మొత్తంగా 15,06,408 ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నా యి. పశుసంవర్ధకశాఖ నేతృత్వంలో పశువులకు సోకే వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు ఉచితంగా వ్యాక్సిన్లు వేస్తున్నారు. ఇప్పటివరకు 15 మండలాల పరిధిలో సుమారు 2,33,550 వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు పశువైద్య సిబ్బంది తెలిపారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన డాక్టర్ వైఎస్సార్ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలల ద్వారా 5,127 పరీక్షలు ఉచితంగా చేయించారు.

చిటుక వ్యాధి

గొర్రెలలో చిటుకు వ్యాధి ఎక్కువగా కనిపిస్తోంది. ఇది బ్యాక్టీరియా వల్ల వ్యాపిస్తోంది. ఈ వ్యాధి సోకిన జీవాలు తూలుతూ నడుస్తాయి. ఉన్నట్లుండి గాలిలో ఎగిరి చిటుకలో చనిపోతాయి. కాబట్టి దీనికి ఆ పేరు వచ్చింది. మందలో 10 పైగా జీవాలు చనిపోతే చిటుకు వ్యాధి సోకినట్లుగా భావించవచ్చు. మందలో నీరసంగా ఉన్న గొర్రెలను మందల నుంచి వేరు చేయాలి. వ్యాధి నివారణకు పెన్సిలిన్ వేయించాలి. వ్యాధి సోకని గొర్రెలకు వ్యాక్సిన్ వేయించాలి.

నీలినాలుక వ్యాధి

ఈ వ్యాధి గొర్రెలు, మేకల్లో వస్తోంది. వైరస్ వల్ల వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి సోకిన జీవాల్లో జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నోటి నుంచి సొంగ కారుస్తాయి. గిట్టలకు పుండ్లు ఏర్పడతాయి. ఆహారం తీసుకోకుండా, బలహీనంగా ఉంటాయి. ఈ వ్యాధి సోకిన జీవాలు మంద నుంచి దూరంగా గుంపుగా ఉంటాయి. ఈ వ్యాధి నివారణకు యాంటీ బయోటిక్స్, లివర్ టానిక్ ఉపయోగించాలి. వ్యాధి సోకిన జీవాలను వేరుచేసి, మిగిలిన వాటికి టీకాలు అందించాలి.

గొంతువాపు వ్యాధి

ఈ వ్యాధి బ్యాక్టీరియా వల్ల సోకుతుంది. అన్ని వయసుల గేదెలు, ఆవుల్లో ఈ వ్యాధి కనిపిస్తుంది. వ్యాధి సోకిన పశువుల్లో 105 నుంచి 106 డిగ్రీల జ్వరం కనిపిస్తోంది. నోటి నుంచి సొంగ కారుతోంది. నోటితో ఎక్కువగా గాలి పీల్చుకుంటాయి. మేత తీసుకోకుండా, గొంతు వద్ద వాపు కనిపిస్తుంది. నివారణకు సల్ఫాడిమిడిన్ మందును ఉపయోగించాలి. నాలుగు నెలలు దాటిన జీవాలకు కచ్చితంగా వ్యాక్సిన్ వేయించాలి.

గాలికుంటు వ్యాధి

ఇది వైరస్ వల్ల కలిగే వ్యాధి. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు ఇలా జీవాలలో కనిపిస్తోంది. వ్యాధి లక్షణాల విషయానికి వస్తే నోటి, గిట్టల్లో పుండ్లు పడటం, ఎక్కువగా జ్వరం ఉంటుంది. ఈ వ్యాధి సోకిన చూడి పశువులు నాలుగు ఐదు నెలల్లో ఈసుకుపోతాయి. నివారణకు బోరిక్‌రిన్ పేస్టును నోటిలో పుండ్లుకు పూతగా పూయాలి. పీపీ ద్రావణంతో కాలిగిట్ల మధ్య కడగాలి. యాంటీబయోటిక్ మందులు, లివర్ టానిక్ ఉపయోగించాలి. ఏటా ఏప్రిల్, మే నెలల్లో వ్యాక్సిన్ చేయించుకోవాలి.

జిల్లాలో పశు సంపద వివరాలు ఇలా..	
ఆవులు	2,28,681
గేదెలు	46,017
గొర్రెలు	1,73,110
మేకలు	2,07,451
పందులు	5,089
కోళ్లు	8,46,060

జాగ్రత్తలు తప్పనిసరి



వర్షాకాలంలో పశువుల పట్ల జాగ్రత్తలు తప్పనిసరి. ముఖ్యంగా అవసరం మేరకు దాణా అందుబాటులో ఉంచుకోవాలి. తడిచిన దాణాను పెట్టకూడదు. పశువుల షెడ్లను పరిశుభ్రంగా ఉంచాలి. ఎండుగడ్డి తడవకుండా చూడాలి. మేతలను అధికంగా పెట్టకూడదు. గుంపుగా అన్నింటినీ ఒకే చోట కట్టరాదు. వరదల కారణంగా గాయపడిన జీవాలకు తక్షణ వైద్య సేవలు అందించాలి. ఈ సమయంలో జంతువులు చనిపోతే కాల్చడం, పూడ్చడం చేయాలి. యాంటీబయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ అందుబాటులో ఉంచుకోవాలి.

– డాక్టర్ ప్రభా మాణిక్యరావు, పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు, పాలకొండ

స్టోన్ ప్లాంటేషన్ సక్రమంగా చేపట్టాలి

● సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్



గుమ్మలక్ష్మీపురం: రేగులపాడులో స్టోన్‌ప్లాంటేషన్ పనులపై అధికారులకు సూచనలు చేస్తున్న సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్

జియ్యమ్మవలస: మండలంలోని చింతలబెలగాం పంచాయతీ సూరపుదొరవలస రెవెన్యూ పరిధిలో జరుగుతున్న స్టోన్ ప్లాంటేషన్ పనులను పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ శనివారం పరిశీలించారు. రెండో విడతలో భాగంగా బిత్రపాడు, జోగిరాజుపేట, సూరపుదొరవలసలో జగనన్న భూశాశ్వత హక్కులో భాగంగా రీసర్వే పూర్తయినందున స్టోన్ ప్లాంటేషన్ పనులు చేపడుతున్నారు. ఆ పనులు ఏ విధంగా చేపడుతున్నారో పరిశీలించారు. సరిహద్దు రాళ్లు పాతే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట డీటీ శివ జగన్మోహనరావు, సర్వేయర్ హనుమంతరావు, వీఆర్వో తిరుపతి ఉన్నారు.

ఎల్విన్‌పేట పంచాయతీలో..

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ రేగులపాడు గ్రామంలో జరుగుతున్న స్టోన్ ప్లాంటేషన్ పనులను సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్ పరిశీలించారు. భూముల సర్వే మేరకు స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని రెవెన్యూ, సర్వే సిబ్బంది సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ జె.రాములమ్మ ఉన్నారు.

జీతాలు చెల్లించాలని డిమాండ్

గరుగుబిల్లి: ఉపాధ్యాయుల జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.కృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు ఎం.మహేష్, బి.మన్మథరావు, బి.శ్రీనివాసరావు, బి.సన్యాసినాయుడు తదితరులున్నారు.

పెదబుడ్డిడిలో డెంగీ కేసు నమోదు

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి గ్రామంలో డెంగీ కేసు నమోదైనట్లు రావివలస పీహెచ్‌సీ వైద్యాధికారి కె.కార్తీక్ తెలిపారు. గ్రామానికి చెందిన పాలిమేర గంగమ్మకు జ్వరం రావడంతో వైద్య పరీక్షలు చేయించుకోగా.. డెంగీగా నిర్ధారణ అయిందన్నారు. ప్రస్తుతం ఆమె విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి బాధితురాలి ఇంటి చుట్టుపక్కల ఉంటున్న వారికి వైద్య పరీక్షలు చేశామని, ఎవరికీ ఎలాంటి అనారోగ్య లక్షణాలు లేవని తెలిపారు. గ్రామంలో దోమల నివారణకు రసాయన మందు స్ప్రే చేయించినట్లు చెప్పారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

నులిపురుగుల నివారణకు చర్యలు



భామిని: నులిపురుగుల నిర్మూలన పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు



పాలకొండ: ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరి

పాలకొండ: నులిపురుగుల నివారణలో భాగంగా ఈ నెల 10 నుంచి చేపట్టే ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరికీ ఈ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో వివిధ గ్రామాలకు చెందిన ఆరోగ్య సిబ్బందికి శనివారం ఆల్బెండజోల్ మాత్రలు అందించారు. అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్, ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి చిరంజీవి ఆల్బెండజోల్ మాత్రల వినియోగంపై అవగాహన కల్పించారు. 1 నుంచి 3 సంవత్సరాల పిల్లలకు ముక్క, 3 నుంచి10 ఏళ్ల వరకు పూర్తి మాత్రను వేయాలని సూచించారు.

భామిని: మండల కేంద్రంలో ఎంపీడీఓ జి.చంద్రరావు, ఈఓపీఆర్డీ జి.కృష్ణారావు ఆధ్వర్యంలో నులిపురుగుల నిర్మూలనపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. డాక్టర్ ఫణికుమార్, పసుపులేటి సోయల్ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఈఓ వి.భాస్కరరావు మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు మాత్రలు పంపిణీ చేసి వాటిని విద్యార్థులకు వేయించాలని సూచించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్

కురుపాం: భాషా వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.రమేష్ డిమాండ్ చేశారు. పి.లేవిడి సమీపంలోని రబ్బరుతోట వద్ద శనివారం భాషా వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. భాషా వలంటీర్లందరికీ గౌరవ వేతనం పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధనకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

9న సీతంపేటలో ఆదివాసీ దినోత్సవం



మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఉట్టిపడేలా ప్రపంచ ఆదివాసీ దినత్సోవాన్ని ఈనెల 9న సీతంపేటలో నిర్వహించుకుందామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి అన్నారు. గిరిజన సంఘాల నాయకులు, ఐటీడీఏ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాల్లో వివిధ గిరిజన జాతులన్నింటికీ ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఉత్సవాలకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తాగునీరు, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

బోగస్ కులధ్రువీకరణ పత్రాలపై విచారణ వేగవంతం

సీతంపేట: బోగస్ ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు పొందిన వారిపై విచారణ వేగవంతం చేస్తామని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి అన్నారు. బోగస్ ఎస్టీ కుల ధ్రువపత్రాలు పొందినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న నలుగురిని స్థానిక ఐటీడీఏలో శనివారం విచారించారు. వారి విద్యార్హతలు, కులధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. సంబంధిత తహసీల్దార్లతో మాట్లాడి మరిన్ని వివరాలు సేకరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు నిధులతో సీసీరోడ్డు నిర్మాణం



సీసీరోడ్డు పనులు పరిశీలిస్తున్న ఇంజినీర్ కళ్యాణదుర్గ

వీరఘట్టం: స్థానిక మేజరు పంచాయతీ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద మంజూరైన నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. సెగిడివీధి నుంచి లెంకవీధి శివారు వరకు రూ.3.06 లక్షలతో వేస్తున్న సీసీరోడ్డును మండల ఇంజినీరింగ్ అధికారి డి.కళ్యాణిదుర్గ శనివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు.

బీఎల్ఓ విధుల నుంచి తప్పించాలని వినతి

భామిని: మండలంలో పనిచేస్తున్న 12 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు బీఎల్‌ఓలుగా నియమించడం తగదని, వారిని బీఎల్‌ఓల బాధ్యతల నుంచి తప్పించాలని వీఈఏలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డీఈఈ దారపు లోకనాథం, ఎంపీడీఓ జి.చంద్రరావు, ప్రత్యేకాహ్వానితులు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ ధర్మారావుకు వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఓలు, కార్యదర్శులు, ఇతర సిబ్బంది ఉండగా వీఈఏలకు పూర్తి బాధ్యత లు అప్పగించడంతో శాఖాపరమైన విధుల నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. దీనిపై తహసీల్దార్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



పరామర్శించిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



పాలకొండ: పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

గరుగుబిల్లి: మండలంలోని నాగూరు గ్రామ మాజీ సర్పంచ్ వాసిరెడ్డి సింహాచలంనాయుడు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శనివారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, నాయకులు కేతిరెడ్డి అచ్యుతరావు, కేతిరెడ్డి కూర్మినాయుడు, అక్కేన వెంకటనాయుడు, బొత్స అప్పలనాయుడు, తదితరులు ఉన్నారు.

పాలకొండ/పాలకొండ రూరల్: నగర పంచాయతీ పరిధి పెదకాపువీధికి చెందిన కిల్లారి సుగుణాకర రావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. పార్టీ కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే అర్దలి గ్రామ సర్పంచ్ గుణుపూరు శివయ్య తల్లి పారమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ గ్రామానికి వెళ్లి శివయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని సంతాపం తెలియజేశారు. ఆయన వెంట కౌన్సిలర్లు కిల్లారి మోహనరావు, కొంచాడ అరుణకుమార్, దుప్పాడ పాపినాయుడు, తుమ్మగుంట శంకరావు, వెలమల మన్మథరావు, తూముల లక్ష్మణరావు, ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్‌రావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లి శివప్రసాద్, పాలవలస దవళేశ్వరరావు, మిర్తివలస సంఘంనాయుడు, బి.సుధాకర్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● డీఎంహెచ్ఓ జగన్నాథరావు



రావివలస పీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

గరుగుబిల్లి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.బి.జగన్నాథరావు అన్నారు. గరుగుబిల్లి, రావివలస పీహెచ్‌సీలను శనివారం ఆయన సందర్శించారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మందులు, సౌకర్యాలు, రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు. ఈనెల 7 నుంచి 12వరకు జరగనున్న మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా వ్యాక్సిన్ వేయాల్సిన పిల్లలను ముందుగా గుర్తించాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించి యూవిన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. వైద్యులు పీపీ ప్రియాంక, కె.అరుణకుమారి పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతం



పాలకొండ రూరల్: ఎం.సింగుపురంలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, మహిళలు

పాలకొండ రూరల్: తల్లిపాలు బిడ్డకు అమృతం వంటివని ఐసీడీఎస్ పీఓ సిమాలమ్మ అన్నారు. మండంలోని ఎం.సింగుపురం సెక్టారులో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. అనంతరం సెక్టారు సూపర్‌వైజర్ దశారత్నం, అంగన్‌వాడీలు, గర్భిణులు, బాలింతలతో కలిసి ర్యాలీ చేపట్టారు.

వీరఘట్టం: తల్లిపాలలో ఔషధ గుణాలు మెండుగా ఉంటాయని ఐసీడీఎస్ పీఓ బి.సిమ్మాలమ్మ అన్నారు. తలవరం గ్రామంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు తప్పకుండా అందించాలని సూచించారు. అనంతరం బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. సర్పంచ్ శిష్టు మధుసూదనరావు, వైస్ ప్రెసిడెంట్ డి.భుజంగరావు, సూపర్‌వైజర్ శాంతికుమారి, రాజాం రూప పాల్గొన్నారు.


భవన నిర్మాణాలు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఈ లోకనాథం

భామిని: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థలో అవసరమైన భవన నిర్మాణాలు పూర్తి చేయడంలో ప్రజాప్రతినిధులు సహకరించాలని పీఆర్ డీఈఈ దారపు లోకనాథం, మండల ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహాచలం శనివారం పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.చంద్రరావు ఆధ్వర్యంలో చేపట్టిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు-15 నాటికి కొన్ని భవనాలు, సెప్టెంబర్-9 ఇంజినీరింగ్ డే నాటికి మగిలిన భవనాల నిర్మాణం పూర్తి చేసేలా ఇంజినీరింగ్ సహాయకులు శ్రమించాలన్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపునకు రంగం సిద్ధం చేసినట్లు చెప్పారు. ఇందులో కొన్ని నిర్మాణాల పూర్తికి గిరిజన సంక్షేమ శాఖకు అప్పగించినట్లు వివరించారు. పీఆర్ ఏఈ ఆర్.గౌరీశంకర్, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, జేసీఎస్ కోఆర్డినేటర్ కె.చంద్రశేఖర్, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు ఎం.మోహనబాబు, బొడ్డేపల్లి ప్రసాద్, వీఈఓలు, పలువురు సర్పంచ్ పాల్గొన్నారు.

పనుకువలసలో ఓటర్ల సర్వే



ఓటర్ల వివరాలు పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పాలకొండ రూరల్: మండలంలోని పనుకువలస గ్రామంలో సర్పంచ్ దేవాది అప్పలనాయుడు నేతృత్వంలో శనివారం ఇంటింటా ఓటర్ల సర్వే నిర్వహించారు. వీఆర్వో చిట్టిబాబు గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలించారు. మరణించిన వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితాల నుంచి తొలగించేలా, అర్హులను జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో ఎటువంటి తప్పిదాలు గుర్తించలేదన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ కోట అజేయ్ బాబు, ముకుందరావు తదితరులున్నారు.

సారా స్వాధీనం

పార్వతీపురం: అడ్డూరువలస వద్ద నిర్వహించిన దాడులలో 160 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ వై.సింహచలం తెలిపారు. ఒడిశా రాష్ట్రం నుండి పార్వతీపురం పట్టణానికి తీసుకువస్తున్న వెలగాడ రవిచంద్రను అదుపులోకి తీసుకొని ఆయన వద్దనున్న 160 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.